

Vemakoti Seeta Rama Sastry
WRITER A.P.E.B. J.A.O. (Retd)
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM.



# ఉమ్మడి కుటుంబంలోకి!

— కె. రామలక్ష్మి

అమ్మాయికేంరా - అప్సరలా వుంది. పల్లెటూళ్లో ఉండిపోవడంతో చదువు కాస్త తక్కువ. గాని, నాగరికతకేంలోటు లేదురా, పదే పదే రాస్తున్నారు వచ్చి పిల్లని చూసుకుని వెళ్లమని... ఎంతకాలంరా దీనితో వేగడం? నువ్వే ఆలోచించు. నాదేం వచ్చే వయస్సా పోయే వయస్సా?" కాస్త కోపంగా, కాస్తంత జాలిగా ఆఫీసుకి బయలుదేరుతున్న కొడుకుతో అన్నారు కామాక్షమ్మగారు.

ఆవిడగారికి చాలాకాలంగా యింటిపట్టున పడి వుండి కాస్త పని పాటలుచేసి వంటచేసి యింతపడేయడమేకాదు, కాస్తంత కాళ్లూ నడుం రాయమంటే గయ్‌మని లేచే కోడలు కాకుండా ఓ పిల్లని తెచ్చి కొడుక్కి కట్టిపడేయాలని, నయానా భయనా చెప్పింది ఏడాది నుంచి. ఇంట్లోంచి పారిపోయి ఛస్తానంది. కానీ రామారావు కాస్త తటాపటాయిస్తున్నాడు ఏం లేదు డేంజరేమో, మొదటికే మోసం వస్తుందేమోనని! "చదువుకోనంత మాత్రాన లోకం తెలియని వాళ్లుండరమ్మా కమలనేం చేయను? అది దాని దారి అది చూసుకుంటే- యీ యింట్లో మనకి ఉనికి వుండదు. బాంకిలోన్ అది పెట్టింది. అదే కొంది కొంపని. మరిచిపోయి యిలా సాధించి చంపుతున్నావు. నువ్వెందుకో క్షణం నా వైపునుంచి ఆలోచించవు. నువ్విలా కోడలుండీ యింటిడి చాకిరీ చేసుకుంటూ మాటా మాటాపడుతుంటే నాకు మాత్రం సంతోషంగా వుందనుకుంటున్నావా?" కోపంగా అరిచాడు.

కమల - కోడలుపిల్ల బాంకు ఉద్యోగం - కాస్త తొందరగా వెళ్లిపోతుంది- జామ్మని స్కూటరు వేసుకుని. రామారావు ఆఫీసుకి పదిగంటలకి వెడతాడు. 'ఒక లోన్ తీసుకున్నాక మళ్లీ స్కూటర్‌కి పెడితే బాగుండదు. మీ ఆఫీసులో పెట్టండి" అని మొగుడికి సలహా యిచ్చింది. 'పోనీ యిద్దరిదీ కాస్త అటు యిటూ టైమైనా బాగుండేది - దింపి వెళ్లడమో ఏదో చేసేదాన్ని!" అంటూ నొచ్చుకుంది కూడా. 'ఈ బోడి సలహా మొగుడికివ్వడానికెంత ధైర్యమే నీకు," అంటూ రామారావు తల్లి పళ్లు పటపట కొరుక్కున్నా పైకి మాటరానివ్వలేదు. అలా పైకంటే ఏమంటుందో కోడలుపిల్ల ఆవిడకి బాగా తెలుసు. "నోరుమూసుకోండి అత్తయ్యగారూ!" అంటూ గడ్డిపెట్టినట్లు మాట్లాడుతుంది! దానికెలా సమాధానం చెప్పాలో ఆవిడకింకా తెలియలేదు.

చాలాకాలంగా నలుగుతుందీ నిశ్శబ్ద యుద్ధం. కాని ఏ ఒక్కరూ 'బాహాబాహీ'గా బయటపడడానికి భయపడుతున్నారు.

"అమ్మా చేసుకోలేకుండా వుంది. పోనీ" అని రామారావు నీళ్లు నాన్చినా 'ఇంకో ఏభైపారేస్తే యింటి పట్టున వుండే మనిషే వస్తుంది. దానికెందుకింతగోల!" అని రపీమని కమల సమాధానం చెప్పేసింది.

రామారావు తన ప్రయత్నాలు మానాడు. కాని అతని తల్లికి 'దీనికి బుద్ధి చెప్పేతీరాలి, ఉద్యోగం చేస్తే యింత స్వతంత్రమా ఎందరు ఆడాళ్లు చేయడంలేదు బోడి ఉద్యోగాలు! ఇలాగే వున్నారా మొగుళ్లతో! కుక్కిన పేలల్లా పడివుండడం తను చూడ్డంలేదూ! జీతంరాళ్లు ఖరాఖండిగా అలాగే తెచ్చి అత్తల చేతిలోనో మొగుళ్ల చేతిలోనో పడేసే వాళ్లు ఎందరో వున్నారు. దీనికెందుకింత పొగరు?...' అన్న కసి ఆవిడ మనస్సులో పెరిగిపోయింది. రోజుకి రోజు అది వామనావతారంగా ఆమె దృష్టినంతా కప్పేస్తోంది. ఎలా! ఎలా! అని బుర్రపగలుకొట్టుకుంటున్న సమయంలో బంగారంలాంటి వార్త ఆమె చెవినిపడి మనసు దూదిపిండెలాగా తేలిక అయింది.

వీళ్లింటికి నాల్గో యింట్లో రెండుగదుల వాటాలో వుండే ఓ తలమాసిన వెధవ హాయిగా కట్నంతో సహా యింకో పెళ్లి చేసుకుని కొత్తపెళ్లికూతుర్ని తీసుకు చక్కావచ్చాడు... అది చూసి కొందరు మొదట్లో ముక్కున వేలేసుకున్నా మూడో రోజు మరిచేపోయారు. ఎవరి గొడవల్లోవారు పడిపోయారు... ఎంతసేపూ పక్కింటి కష్టం పట్టించుకుని కూర్చునేటంత విశ్రాంతి పట్నవాసులకెక్కడ దొరుకుతుంది?

ఆరోజు మొదలు కొడుకు మెదడు తినడం ప్రారంభించింది రామారావు తల్లి. "వాడుట్టి జులాయి వెధవ, ఒక పూట తింటే ఇంకో పూటకి వెతుక్కోవాలి. రెండేసి నెలలు మూడేసి నెలలు ఇంటి అద్దె బకాయేనని ఆ యింటావిడ గోల చేస్తూనే వుంటుంది. ఎప్పటికప్పుడు ఖాళీచేసి పొమ్మని గోలచేస్తూనే వుంటుంది. ఏం! వాడికున్న పాటి ధైర్యం నీకు లేదురా? ఇలా అడంగి బ్రతుకెన్నాళ్లు బ్రతుకుతావు! ఏదీ? మూడేళ్లుదాటిపోయింది - దాని కడుపున ఓ కాయా పువ్వా, ఏం లేదు... పోనీ అదేం బాధపడుతోందా అదీలేదు. అంతా నన్నడుగుతారు... ఎప్పుడండీ మనవడిని ఎత్తుకునేది! యింకా కాస్తా కాలుచేయా ఆడుతున్నప్పుడు కదా అచ్చటాముచ్చటా! ఏం మీ కోడలు పిల్లల్ని కనదా? ఈ రోజుల్లో ఫాషన్ కాదా! అని నిలదీస్తుంటే సిగ్గుతో చచ్చిపోతున్నానురా... దాన్నెలా ఒప్పిస్తావో తెలియదు నువ్వు మళ్లీ పెళ్లి చేసుకోవలసిందే.. ఎలా అన్నది నాకు వదిలెయ్."

"ఎందుకే అమ్మా కొరివితో తలగోక్కోవడం! యిప్పుడు హాయిగా వున్నామూ, రేపు యింకో పెళ్లిచేసుకుంటే... అది ఎంత గొడవ అవుతుందో భయంగా వుంది."

కొడుకుకి ఉద్దేశ్యం నచ్చింది గాని కాస్త భయపడుతున్నాడని ఆ తల్లి యిట్టే గ్రహించేసిందీ - మాటు. కోడలుపిల్లని దబాయించి నోరు మూయించడం కష్టంకాదు, అంతగా కాకుంటే యిల్లు వదిలి చక్కాపోతుంది... పీడ విరగడై

పోతుంది... పంచభక్ష్యపరమాన్నాలతో యీ తిండి తినడం కంటే అధారిటీ చెలాయిస్తూ గంజి తాగుతాను.. అని నిర్ణయించుకుని కొడుక్కి చెప్పింది. రామారావేం బదులు చెప్పలేదు. 'మౌనం అర్థాంగీకారం' అని సంతోషపడి పోయిందా తల్లి. పెళ్లిళ్ల పేరయ్యలకేం లోటు? క్షణాలమీద 'సంబంధం కావాలి ఇదీ సంగతి' అంటూ అసలు విషయం చెప్పి 'మీ చేతుల్లో పెడుతున్నాను... మీదే భారం' అంటూ వూరు కుంది. ఎన్నెన్నో సంబంధాలు తెస్తున్నారు, వద్దను కుంటున్నారు.

• • •

"ఏమిటి మీ అమ్మగారు చాలా హుషారుగా వుంటున్నారు. కాలునెప్పి లెక్కచేయకుండా పక్క వీధి శాస్త్రుర్లుగారింటికి వెళ్లివెళ్లి వస్తున్నారు... మనకి పిల్లలెప్పుడు పుడతారని అంజనం వేయి స్తున్నారా? లేక..." అర్థాంతంగా ఆపి రామారావు ముఖంలోకి చూసింది కమల.

దొంగతనంగా స్వీట్ తినడానికి ప్రయత్నిస్తూ దొరికిపోయిన చక్కరవ్యాధి రోగిలాగా కనిపించాడా సమయంలో రామారావు. "చెప్పండి ఫరవాలేదు. ఇంటిమీద అప్పుతీరే దాకా పిల్లలు వద్దనుకున్నామని మీరావిడకి ఎందుకు చెప్పరు? నేను గొడ్రాలినని నలుగురిలో అంటూంటే ఆత్మహత్య చేసుకుంటానని అనుకుంటున్నారా? దాస్తున్న విషయం ఏమిటో చెప్పండి-" సూటిగా అడుగుతున్న భార్య ముఖంలోకి చూసి కాస్త బిడియపడుతూనే,

"కమలా.... అమ్మ పెద్దదైపోయింది. కీళ్ల నొప్పులు, ఒంగలేదు, కూర్చోలేదు... నడవలేదు, పనిపాటలు చేసుకోలేకుండా వుంది... ఇంటి పట్టున కోడలుండి చేదోడువాదోడుగా వుంటే బాగుండుననుకుంటోంది... నువ్వో ఏడాది సెలవు పెట్టకూడదూ? నీకూ విశ్రాంతి!" తనడిగిన మాట తనకే సిల్లీగా వుందని తెలుస్తూనే వుంది రామారావుకి... కాని తల్లి మాట కాదనలేదు. పెళ్లానికేం చెప్పలేదు... ఏం చేయాలి! అందుకే ఆ పూట ధైర్యం చేసి చెప్పాడు. గలగల నవ్వేసింది కమల. "దీనికింత ఆలోచన దేనికి! నేను ఎప్పుడో చెప్పాను. ఇంటిపట్టున వుండే మనిషిని పెట్టు కుంటే సరిపోతుందని.."

"అమ్మ అలాఅనుకోడంలేదు. కోడలు యింటి పట్టున వుండాలని అంటూంది."

"మీలాంటి వాళ్లకి అవ్వా కావాలి బువ్వా కావాలి. పెళ్లాం జీతాలు కావాలి. ఇంటి దగ్గిర అదే పనిమనిషిగా కావాలి. ఎక్కడో ఒక చోట మీలాంటి అత్యాశాపరులు కాంప్రమైజ్ కాకపోతే – ఎదురు దెబ్బ తింటారు..." అంది.

"అది కాదు కమలా..." అని రామారావు ఏదో వివరణ చెప్ప ప్రయత్నించాడు. దాన్ని విన దలుచుకోలేదు కమల.

"మీరు జగమెరిగిన జాతి. మీ యిష్టం వచ్చి నట్టు చేయండి. అది మాలాంటి రెండవ తరగతి మనిషి చేస్తే యీ లోకం హర్షించదు. నేను రెండు నెలలు ట్రయినింగుకి వెళ్తున్నాను ఒచ్చే ఫస్టుకి... తరవాత ట్రాన్స్ఫరు కూడా రావచ్చు... ప్రయత్నిస్తే దాన్ని ఆపుకోవచ్చు, మీ ఉద్యోగం అటూ ఇటూ కదలలేనిది కనుక!" అని హాండ్ బ్యాగ్ తీసుకుని స్కూటర్ కీ అన్నీ ఉన్నాయా లేదా అని చూసు కుంది... భర్త ముఖంలోకోసారి చూసి బయటికి నడిచింది కమల. ఆమె జోళ్ల చప్పుడు కాస్తదూరం కాగానే... అప్పటిదాకా తలుపు వెనక వున్న రామారావు తల్లి, గట్టిగా వూపిరి తీసుకుంటూ సంతోషంగా బయటపడింది. "రామం! కాలం కలిసొస్తే... యిలాగే పనులు జరిగిపోతాయిరా. ఇంక నువ్వు కాదన్నా వూరుకోను. రెండు నెలలు ఎలాగా వుండదు. తరవాత ... అదే వూరు కుంటుంది. ఈ సంబంధం కాదన్నావంటే నేను ఛస్తా!"

"పెళ్లయిన వాడికి పిల్లనిస్తామని ఎలా అంటారమ్మా" అనుమానంగా అడిగాడు.

"అదెందుకూ చెప్పడం... అదా పల్లెటూరు మొద్దు. తండ్రికా కళ్లు కనిపించవుట. ఎలాగో పిల్లని ఎవడితలనో కట్టబెట్టి ఏ కాశీకో పోవాలని... కాస్తపొలం వుంది. అది పిల్లపేర రాసి వుంది... యింకేమిటి నీకు అభ్యంతరం."

"మొదటి భార్య!" పేలవంగా అన్నాడు రామారావు.

"ఏడిసినట్టుందిరా నీ తెలివి. యీ సంగతి మనం చెప్పడం దేనికి? ఉమ్మడి కుటుంబంలో యిమిడిపోయేపిల్ల కావాలని చెప్పాను. ఇంత కంటే మంచి పిల్ల ఎక్కడ దొరుకుతుందిరా. ఎటూ పోలేదు... మన పంచనపడి వుంటుంది! ఇక కమలా! ఏం చేస్తుంది! అంతా అయిపోయాక నోరుమూసుకుపడి వుండకఛస్తుందా. ఆడదన్నాకా బరితెగించి వీధినపడదు కదా! నువ్వూరుకో, ఏదో ముహూర్తం అనిపించి పిల్లని తెచ్చి యింట్లో పడేసుకుందాం. అన్నీ అవే సద్దుకుంటాయి!" అంటూన్న తల్లి ధైర్యానికి, ఆమెలో ఉవ్వెత్తున పొంగిపోతున్న ఉత్సాహానికి ఆశ్చర్యం వేసింది రామారావుకి... రంగంలోకి దిగిన తల్లికి సర్వ రోగాలూ క్షణంలో హరించిపోయాయా అని పించింది అతనికి.

• • •

అన్నవరం కొండ మీద పెళ్లి చేసుకున్నాడు రామారావు. సుబ్బలక్ష్మి అందమైన అమాయకు రాలు. అలంకరించుకోడం నేర్చుకుందే గాని సినిమాలు చూసి, ఆలోచించడం నేర్చుకున్నట్టు లేదు. ఉమ్మడి కుటుంబంలో పని పాటలు అందరూ పంచుకుంటారు, హాయిగా 'జోరుగా షికారుగా' వుంటుంది జీవితం అని... పంచ రంగుల కలలుకంటూ రామారావు చెయ్యి అందుకుని - అత్తగారు దారి చూపగా పట్నంలో వచ్చివాలింది. ఏభైకాసుల బంగారం, బంగారాన్ని మించిన పొలం... "ఏడాది తిరిగేసరికి యింటికి వచ్చిపడుతుంది దాని డబ్బు. అల్లుడూ, నీ చేతుల్లో పెట్టి నేను హాయిగా కాశీపోతాను..." గుడ్డి కళ్లు కారుస్తూవున్న కన్నీళ్లు తుడుచుకుంటూ, కూతుర్ని అల్లుడికీ అత్తగారికీ అప్పగింతలు పెట్టి, బాధ్యత దించుకున్న ఆనందంతో తేలికపడ్డ మనస్సుతో... దూదేపింజెలాగా తేలిపోయాడాపిచ్చి తండ్రి... తన కూతుర్ని కోరి చేసుకునే వాడొకడు వచ్చినందుకే పరమ సంతోషపడిపోయాడాయన.

• • •

పట్నంలో ఇల్లు స్వర్గంలా వుంది సుబ్బలక్ష్మికి. కుళాయి తెరిస్తే నీళ్లు. రాయికేసి బాది ఉతకక్కర లేని బట్టలు... కళ్లుమండని కుంపట్లు ఆమె సంతోషానికి అవధుల్లేవు. రామారావు ఆమెని సినిమాలకీ షికార్లకీ తిప్పాడు. 'అందమైన పెళ్లాన్ని ఎందుకు తిప్పడు!' ఎప్పుడూ పనితో పై ప్రమోషన్కోసం పరీక్షలు రాయడానికి చదువుతో సతమతమయ్యే కమలలోలేని ఎన్నో సొయగాలు యీ నిరక్షరాశ్యురాలిలో అతనికి కనిపించాయి. భర్త కనుసన్నల మెలగడమే పత్ని ధర్మంగా, అత్తకి సేవ చేసుకోడమే కోడలి పరమావధిగా నేర్చుకున్న సుబ్బలక్ష్మికి ఇద్దరికి వంట చేయడం కానీ... అన్నీ పరమరుచిగా చేయడం పెద్ద కష్టమైన పనికాదు. వినడానికి రేడియో, చూడడానికి టి.వి... అన్నీ బాగున్నాయి. ఉమ్మడికుటుంబం అన్నారు బావమరుదులూ తోటి కోడళ్లుగాని ఎవరూ కనబడకపోవడం ఆశ్చర్యం వేసింది. "అత్తయ్యా, అంతా ఏరి?" అడిగిందో రోజు కుతూహలం పట్టలేక. "వచ్చేస్తుందే రేపోమాపో" యధా లాపంగా అంది రామారావు తల్లి.

"అంటే?" అర్థంకాక అడిగింది.

ఆమెకింకా సమాధానం రాకుండానే వీధి గుమ్మంలో కారు ఆగింది.

"ఎవరో వచ్చారు అత్తయ్యా" అంటూ ఒంటి నిండా కొంగుకప్పుకుంది సుబ్బలక్ష్మి.

'వెళ్లొస్తాను మేడమ్" అని సలామ్ పెట్టి డ్రయివరు వెళ్లాడు. పెట్టెపైకెత్తపోతూండగా,

"వుండండి నేను తెస్తాను." అంటూ సుబ్బ లక్ష్మి అందుకుందా పెట్టె. క్షణంపాటు నమ్మ లేనట్టు సుబ్బలక్ష్మి ముఖంలోకి చూసింది కమల.

సుబ్బలక్ష్మి సిగ్గుతో తలదించుకుని నిలబడి పోయింది. కమల ఆమె గెడ్డంకింద చూపుడు వేలు పెట్టి ముఖం పైకెత్తి కుతూహలంగా చూసింది.

సుబ్బలక్ష్మి కనురెప్పలు బరువుగా వాలి పోయాయి.

"నువ్వెవరో అర్థమైందిలే. నీపేరు?" సౌమ్యంగా అడిగింది. "సుబ్బలక్ష్మి, నన్ను మీరు ఎలా పిలిచినా ఫరవాలేదు. అత్తయ్య సుబ్బీ అంటున్నారు. వారు..." మళ్లీ సిగ్గు ముంచుకు రాగా తల బలవంతాన దించేసుకుంది.

"ఫరవాలేదులే, నీ వారే నా వారూ. నీకు తెలియదేమో పద నా గదిలో పెట్టు పెట్టె" అంది నవ్వుతూ కమల. సుబ్బలక్ష్మి చేతిలో పెట్టెని ధబీలున కింది పెట్టింది. సిగ్గు ఎక్కడికి పోయిందో... కళ్లు పూర్తిగా తెరిచి - 'మీరు మీరాయన భార్యా!" నమ్మలేనట్టు అడిగింది.

KRISHNA NAGAR Plot No. 24 SRIKAKULAM

అవునన్నట్టు తలూపింది కమల. ఆమెకీ మోసానికి కోపం రాలేదు సరికదా మోసపోయిన సుబ్బలక్ష్మి మీద జాలి ముంచుకొచ్చింది.

"ఉమ్మడి కుటుంబం- సర్దుకుపోవాలి అన్నారు, అంటే ఇదా?" ఆశ్చర్యంగా అడిగింది.

"అలా చెప్పారా, చెప్పినా ఆశ్చర్యం లేదు నాకు... నేను సంపాదించి పడేస్తే నువ్వు చాకిరి చేస్తావు... మధ్యన వాళ్లిద్దరూ అలిసిపోకుండా దర్జాగా జీవించేస్తారు. బాగుంది కదూ "నవ్వుతూ మేడమీద తన గదికేసి నడిచింది కమల. "నేనెందుకు చేయాలి చాకిరీ! నాకు పొలం మీది నుంచి ఏటా ఏభైవేలైనా వస్తుంది..." కసిగా అంటూన్న సుబ్బలక్ష్మి స్వరం 'లక్ష్మి తలతుడు!' అన్న కేకలో కలిసిపోయింది. స్నానం చేసి తలేనా ఎత్తకుండా ఎదుటి దృశ్యం చూడకుండా కేకేశాడు రామారావు.

"తుడవడం ఏం కర్మ! ఏకంగా నరుకుతాను. మానాన్న గుడ్డివాడని నేను చదువుకోని దాన్నని... నన్నిలా మోసం చేస్తారా!" సింహంలాగా రామారావు మీదికి వురికింది సుబ్బలక్ష్మి.

"పెల్లి అని పులిని కట్టపెట్టానా ఏమిటి?' అంటూ నోరునొక్కుకుంది రామారావు తల్లి.

"చూడు సుబ్బలక్ష్మి, అతనినేం అనకు పాపం. చేతకాని వాడు. కష్టపడకుండా సుఖపడాలనే ఆశాజీవి. నువ్వు నాతో పైకిరా... మాట్లాడు కుందాం.." ఆప్యాయంగా పిలుస్తున్న కమలని చూసి గుడ్ల నీళ్లుకక్కుకుంటూ ఆమె వెనుక పరుగెత్తింది సుబ్బలక్ష్మి.

• • •

ఆ తరవాత కాలం ఎలా గడిచిందో తెలియలేదు రామారావుకీ తల్లికీ.. కమల లాయరు చుట్టూ ప్రదక్షిణాల చేయడంతో సరిపోయింది. బైగమిలో బిగించకుండా తప్పుకుందుకు ఏం చేయడానికేనా సిద్ధపడ్డాడు రామారావు... లేకుంటే ఉన్న ఉద్యోగం కాస్తా వూడిపోతుంది, పరువు ప్రతిష్టలతోపాటు! అని భయపడ్డాడు. లాయరు కూడా అడదే కర్మ! అనుకున్నాడు రామారావు. "శాంతా... కర్రవిరక్కూడదు.. పాము చావకూడదు ఏం చేస్తావో నీ యిష్టం. సుబ్బలక్ష్మి నా దగ్గిర వుండడం నాకేం కష్టం కాదు. రిటైరైన మా మేనత్తని వచ్చి వుండమంటా. కాస్త చదువు నేర్పుతుంది. అయితే నా యింట్లో వాళ్లిద్దరూ వుండడానికి వీల్లేదు. పది పదిహేను రోజుల్లో యిల్లు ఖాళీచేసి వెళ్లేలా చూడు." అని చెప్పింది లాయర్ శాంతకి కమల.

అదే స్పష్టంగా రాయించి - "ఇష్టం అయితే సంతకం చెయ్యండి. లేకుంటే మీ యిష్టం, లాయర్ని పెట్టుకుని కేసు వాదాడండి. గెలిచే అవకాశాలు తక్కువ అని మీరీ పాటికి గ్రహించే వుంటారు." మెత్తగా చురక వేసింది శాంత.

"అంత తక్కువ వ్యవధిలో ఇల్లెలా దొరుకు తుంది లాయర్‌గారూ యింకాస్త..." అతని మాట పూర్తికానీయలేదు శాంత.

"ఇంత తక్కువ వ్యవధిలో పెళ్లాం దొరకగా లేంది ఇల్లు దొరకడం ఏం కష్టం మిస్టర్ రామారావు?... మీ ఇంటికి అదే, కమల యింటికి నాలుగో యింట్లో ఓ వాటా ఖాళీ అయిందని విన్నా కమల చెప్పింది, మీ సామాన్లు అక్కడికి తరలిస్తే చాలదా!"

"అంత చిన్న యింట్లోనా"

"మీ మనసు అంతకంటే చిన్నది మిస్టర్ రావు. మీ అమ్మగారికి జ్ఞానం లేకుంటే మీకు లేదా! ఉమ్మడి కుటుంబం అంటే సవితితో కాపురం అని కొత్తర్థం చెప్పడానికి మీకెంత ధైర్యం సార్. పల్లెటూరి పిల్లల అమాయకత్వాన్ని చేతకాని తనంగా అంచనా వేశారు. అనుభవించండి. ఏం చేస్తాం? విడాకులు అందుకోగానే వివాహ ప్రయత్నం సాగించండి అంతకి ముందు చేస్తే.. యింతే.. కటకటాలు లెక్కపెట్టడం తప్పినందుకు సంతోషించండి సార్. అది కమల విశాలమైన మనసుకి నిదర్శనం, ఆమెకి సుబ్బలక్ష్మి పట్ల కల్గిన అభిమానానికి నిదర్శనం. నిజంగా-- ఆ ఇద్దర్నీ చూసి గర్వపడాలి..." శాంత మాటలు పూర్తి కాకుండానే కలం అందుకుని – కాగితాలపై సంతకాలు చేయడం ప్రారంభించాడు రామారావు. అతని మనసిప్పుడు ఆకాశమంత శూన్యం గానూ సముద్రమంత అల్లకల్లోలంగానూ వుందనడం అతిశయోక్తికాదు.


మీ భవిశ్యత్తును తెలుసుకోండి

భవిశ్య ఫోన్

వారఫలాలు

☎ 001 609 936 30 + ☐☐

పైన ఇచ్చిన మొత్తం పదకొండు అంకెలకు మీ సూర్యరాశికి ఎదురుగా ఇచ్చిన రెండు అంకెలను కలిపి వరుసగా డయల్ చేయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| 51 | 52 | 53 | 54 | 55 | 56 |
| మేషం | వృషభం | మిథునం | కర్కాటకం | సింహం | కన్య |
| 57 | 58 | 59 | 60 | 61 | 62 |
| తుల | వృచ్ఛికం | ధనుస్సు | మకరం | కుంభం | మీనం |

టారట్
జాతక ఫలాలు

ఇది జాతక ఫలాలను చెప్పే ప్రాచీన పద్ధతి. మీరు అడిగే నిర్దిష్టమైన ప్రశ్నలకు సమాధానాలు యిస్తుంది.

ఫోన్ చేయండి:

001 609 936 3086

రాశి కలయిక

మీరు, మీ జీవిత భాగస్వామి. ఎంత అన్యోన్యంగా ఉంటారు?

ఫోన్ చేయండి

001 609 936 3063

ఇది ఇంటర్నేషనల్ కాల్. నిర్దిష్టమైన ధరలు వర్తిస్తాయి. వరల్డ్, ఫోన్ యు.ఎస్.ఎ.